# మానవ స్వత్వముల సార్వలౌకిక ప్రకటన

## ప్రస్తావన

మానవ కుటుంబము నందలి వ్యక్తులందరికిని గల ఆజన్మ సిద్ధమయిన ప్రతిపత్తిని, అనన్యా క్రాంతములగు సమాన స్వత్వములను అంగీకరించుట ప్రపంచమున స్వాతంత్ర్య, న్యాయ, శాంతుల స్థాపనకు పునాది యగును.

మానవజాతి అంతఃకరణమును క్షోభ పెట్టిన ఘోర చర్యలు, మానవ స్వత్వముల యెడ గలిగిన అవజ్ఞా నిరసన భావముల పరిణామ మనియు, వాక్స్వాతంత్ర్య ప్రత్యయ స్వాతంత్ర్యములను, భయ విముక్తిని, దారిద్ర విముక్తిని మానవు లెల్లరు అనుభవించుటకు వీలగు లోకము యొక్క అవిర్భావమే సామాన్య ప్రజానీకము యొక్క మహోన్నత మయిన అభికాంక్ష యనియు ఉద్ఘోషింపబడి యున్నది.

నిష్ఠురపాలనా ప్రజా పీడనముల పై, గత్యంతరము లేక, మానవుడు తిరుగుబాటు చేయ వలసిన బలాత్కార పరిస్థితులు ఏర్పడకుండ నుండ వలయు నన్నచో మానవ స్వత్వములు విధి నియమముచే పరిరక్షితము లగుట ముఖ్యము.

రాష్ట్రముల మధ్య సౌహార్ద బాంధవ్యముల అభివృద్ధికి దోహదము చేయుట అత్యావశ్యకము.

మానవుల మూలస్వత్వముల యందును, వ్యక్తుల ప్రతిపత్తి యోగ్యతల యందును, స్త్రీ పురుషులకు గల సమాన స్వత్వముల యందును, తమకు గల విశ్వాసమును ఐక్య రాష్ట్రముల వారు ఈ శాసన పత్రమున పునః ప్రమాణీకరించి, సామాజికాభ్యుదయమును, ఉన్నత జీవిత ప్రమాణములను, విశాల స్వాతంత్ర్యమును పెంపొందించుటకు నిశ్చయించు కొనియున్నారు.

మానవ స్వత్వ, మూల స్వాతంత్ర్యముల యెడ సార్వలౌకిక గౌరవాభివృద్ధిని, వాని యనుష్ఠానమును ఐక్య రాష్ట్రముల సహకారము తో సాధించుటకు వ్యక్తి రాజ్యములు ప్రతిజ్ఞ చేసికొనియున్నవి.

ఈ స్వత్వములను గూర్చియు, స్వాతంత్ర్యములను గూర్చియు, సాధారణముగ నెల్లరకును తెలిసి యుండుట ఈ ప్రతిజ్ఞా సమగ్రసిద్ధి కెంతయు ముఖ్యము.

సమాజమునకు చెందిన ప్రతి వ్యక్తియు, సమాజము యొక్క ప్రత్యంగమును, ఈ స్వత్వముల ప్రకటనను సదా మనసు నందుంచు కొని, ఉపదేశ విద్యబోధలచే వీని యెడ గౌరవమును పెంపొందించుటకును, మరియు, రాష్ట్రీయములు నంతర్ రాష్ట్రీయములునగు సభ్యుదయ విధానముల ననుసరించి వ్యక్తి రాజ్యములలోని ప్రజల యందును, వా రాజ్యముల యధికారమునకు లోబడియుండు క్షేత్రముల లోని ప్రజల యందును గూడ, నీ స్వత్వ స్వాతంత్ర్యముల ఫలకార కాంగీకారానుష్ఠానములను సార్వలౌకికముగ సునిశ్చితము చేయుటకును ప్రయత్నించ వలెను. ఇట్టి యాశయము తో సకల మానవులకును రాష్ట్రములకును సమాన ప్రమాణమును సంపాదించు నదిగా నీ మానవ స్వత్వముల సార్వలౌకిక ప్రకటనను సర్వజనీన పరిషత్తు ఉద్ఘోషించుచున్నది

**అనుచ్ఛేదము *1.*** ప్రతిపత్తి స్వత్వముల విషయమున మానవు లెల్లరును జన్మతః స్వతంత్రులును సమానులును నగుదురు. వారు వివేద వాంతఃకరణ సంపన్ను లగుటచే పరస్పరము భ్రాతృ భావము తో వర్తింప వలయును.

**అనుచ్ఛేదము *2.*** *(!)* జాతి, వర్ణము, లింగ భేదము, భాష, మతము, రాజకీయాభిప్రాయ భేదము, రాష్ట్రీయము లేక సామాజికమునగు జననము, ఆస్తి, కులీనత, ప్రతిష్ఠ, ఇత్యాది యెట్టి విభేదము గాని పాటింప బడక, ఈ ప్రకటనలో పొందు పరుపబడి యున్న స్వత్వ స్వాతంత్ర్యముల కన్నిటికిని ప్రతి యొకరికి నధికారము కలదు.

*(!!)* స్వతంత్రముగను, న్యాసముగను, అస్వాయత్తశాసక క్షేత్రముగను, లేక, అనధిశాధి రాజ్యమునకు లోబడినదిగను నుండు నెట్టి దేశమునకు గాని, రాజ్య క్షేత్రమునకు గాని ఒక వ్యక్తి చెందియున్న కారణమునుబట్టి ఆ దేశము యొక్క లేక, ఆ క్షేత్రము యొక్క రాజకీయాధికారి కాంతర్ రాష్ట్రీయ ప్రతిష్ఠలకు సంబంధించిన యెట్టి విభేదము గాని పాటింపబడదు.

**అనుచ్ఛేదము *3.*** జీవిత రక్షణకు, స్వేచ్ఛకు, దేహ రక్షణకు, ప్రతి యొకరికిని హక్కు గలదు.

**అనుచ్ఛేదము *4.*** ఏ వ్యక్తిని గాని బానిసతనముకును, దాస్యమునకును లోనుగావింపకూడదు. అన్ని విధములయిన బానిసతనములును, బానిస వ్యాపారములును నిషేధింప బడవలెను.

**అనుచ్ఛేదము *5.*** ఏ వ్యక్తిని గాని, క్రూరము, అమానుషము, నికృష్టమునగు ప్రయోగమునకును శిక్షకును గురి చేయరాదు.

**అనుచ్ఛేదము *6.*** సర్వత్ర, విధిసమక్షమున నొక వ్యక్తిగా అంగీకరింపబడు నధికారము ప్రతి యొకరికిని గలదు.

**అనుచ్ఛేదము *7.*** విధి సమక్షమున నెల్లరును సమానులు, మరియు, నెట్టి విభేదము గాని పాటించక, విధి యొసగు సమానమగు పరి రక్షణను పొందు నధికార మెల్లరకును గలదు. ఈ ప్రకటనను వ్యతిక్రమించు నెట్టి విభేదము నుండి గాని, అట్టి విభేద కారమగు నే ప్రేరణనుండి గాని పరి రక్షింపబడుట కెల్లరకును సమానమగు హక్కు గలదు.

**అనుచ్ఛేదము *8.*** సంవిధానముచే గాని విధిచే గాని యొసగ బడిన మూల స్వత్వములను వ్యతి క్రమించు కార్యముల విషయమున, సమర్థమగు రాష్ట్రీయ న్యాయాధికరణ సభచే ఫలప్రదమగు ప్రతిక్రియను పొందుటకు, ప్రతి వ్యక్తికిని హక్కు గలదు.

**అనుచ్ఛేదము *9.*** ఏ వ్యక్తినీ విరుద్ధమయిన నిర్బంధమునకు గాని, నిరోధమునకు గాని, నిర్వాసమునకు గాని, లోబరుపకూడదు.

**అనుచ్ఛేదము *10.*** ప్రతి వ్యక్తికిని, అతని స్వత్వముల యొక్కయు ఆభారము యొక్కయు నిర్ణయము నందును, అతని పైనున్న ఏ దోషారోపణ యొక్క నిర్ణయము నందును, స్వతంత్రము, నిష్పక్ష పాతమునగు న్యాయాధికరణ సభ యెదుట, న్యాయము, బహిరంగమునగు విచారణకు పొందుటకు సమానమగు సమగ్ర స్వత్వము కలదు.

**అనుచ్ఛేదము *11.*** *(!)* దండనీయమయిన నేరమారోపింపబడిన ప్రతియొకరును, తన ప్రతి రక్షకు ఆవశ్యకములగు అభయముల నన్నిటిని పొందియుండి, బహిరంగ విచారణలో విధి ననుసరించి దోషిగా నిరూపింప బడునంతవరకు, నిర్దోషిగా పరిగణింప బడుటకు హక్కును కలిగియున్నారు.

*(!!)* ఏ కార్యము యొక్క ఆచరణ గాని, తదాచరణ లోపము గాని, రాష్ట్రీయము లేక అంతర్ రాష్ట్రీయమునగు విధి ననుసరించి దండనీయమయిన నేరముగా, ఆ నేరము జరిగిన సమయమున విధింపబడి యుండలేదో, అట్టియే నేరమునకై గాని, యెవరును దండనార్హులుగా పరిగణింపబడ కూడదు. దండనీయ మయిన నేరము జరిగిన సమయమున ఆ నేరమునకై విధింపబడిన శాస్తికంటె నధికమగు శాస్తిని విధింపకూడదు.

**అనుచ్ఛేదము *12.*** అంతరంగిక, కుటుంబ, గృహ, లేఖా వ్యవహారములలో, విధి విరుద్ధమయిన జోక్యమునకు గాని, గౌరవ ప్రతిష్ఠలను భంగపరచు ప్రచారములకు గాని యెవరిని గురి చేయరాదు. అట్టి జోక్యము నుండియు, ఆ ప్రచారముల నుండియు విధి ద్వారా పరి రక్షింపబడుటకు ప్రతి యొకరికిని హక్కు గలదు.

**అనుచ్ఛేదము *13.*** *(!)* ప్రతి రాజ్యము యొక్కయు హద్దుల లోపల స్వేచ్ఛా సంచారమునకును, నివాసమునకును, ప్రతి వ్యక్తికిని హక్కు గలదు.

*(!!)* స్వదేశము నుండి గాని, ఏ యితర దేశము నుండి గాని ప్రవసించుటకును, స్వదేశమునకు మరలి వచ్చుటకును ప్రతి యొకరికిని హక్కు గలదు.

**అనుచ్ఛేదము *14.*** *(!)* పరపీడనము నుండి రక్షణాశ్రయము నన్యదేశముల లో నన్వేషించుటకును, అట్టి ఆశ్రయము ననుభవించుటకును ప్రతి వ్యక్తికిని హక్కు గలదు.

*(!!)* రాజకీయములు గానట్టి నేరముల వలన యథార్థముగ నుత్పన్నములగు నట్టియు లేక ఈ ఐక్యరాష్ట్ర సమితి యొక్క ప్రయోజనములకు, సూత్రము లకును విరుద్ధము లయిన కార్యముల వలన నుత్పన్నములగు నట్టియు, అభియోగముల విషయములలో, పై హక్కులను ఆర్థించుటకు వీలులేదు.

**అనుచ్ఛేదము *15.*** *(!)* ప్రతి వ్యక్తికిని ఒక రాష్ట్రీయతకు హక్కు గలదు.

*(!!)* ఏ వ్యక్తిని గానీ, విధి విరుద్ధముగా రాష్ట్రీయతా భ్రష్టుని జేయరాదు. మరియు, తన రాష్ట్రీయతను మార్చుకొనుట కతనికి గల హక్కును లేదన కూడదు.

**అనుచ్ఛేదము 16.** *(!)* యుక్తవయః పరిపూర్ణులయిన స్త్రీ పురుషు లెల్లరకును, జాతీయ రాష్ట్రీయ మతాదిక పరిమితత్వము పాటింప బడక, వివాహములు చేసికొనుటకును, కుటుంబ స్థాపన చేయుటకును హక్కు గలదు. వివాహ విషయముననను, వివహ కాలముననను, విశ్లేష విషయముననను స్త్రీ పురుషులకు సమానములగు హక్కులు గలవు.

*(!!)* ఉద్దిష్టులగు సతీసతులు తమ స్వేచ్ఛా పూర్వక సంపూర్ణాంగీకారము తోడనే వివాహ విధిప్రయుక్తులు గావలయును.

*(!!!)* కుటుంబము, సమాజమునకు సహజమును, ప్రాతిపదికమునగు ప్రమాపక మూల మైయున్నది, కనుక నది సమాజము చేతను రాజ్యము చేతను పరిరక్షిత మగుట కధికారము కలిగియున్నది.

**అనుచ్ఛేదము 17.** *(!)* స్వతంత్రముగ గాని, ఇతరులతో చేరి గాని, ఆస్తిని కలిగి యుండుటకు ప్రతి వ్యక్తికిని హక్కు గలదు.

*(!!)* విద్ధి విరుద్ధముగ ఏ వ్యక్తిని గాని ఆస్తి భ్రష్టునిగ చేయరాదు.

**అనుచ్ఛేదము 18.** ప్రతి వ్యక్తికిని, భావ స్వాతంత్ర్య, అంతఃకరణ స్వాంతంత్ర్య, మత స్వాతంత్ర్యములకు హక్కు గలదు. తన మతమును ప్రత్యయమును మార్చు కొనుటయును, ఒంటరిగ గాని, సాంఘికముగ గాని, బహిరంగముగను, అంతరంగికముగను ఉపదేశ, అనుష్టాన, ఆరాధన, ఆచరణలచే తన మత ప్రత్యయములను వ్యక్తీకరించుటయును, ఈ హక్కులో నిమిడి యున్నవి.

**అనుచ్ఛేదము 19.** ప్రతి వ్యక్తికిని అభిప్రాయ స్వాతంత్ర్యమునకును, భావప్రకటన స్వాతంత్ర్యమునకును, హక్కు గలదు. పరుల జోక్యము లేక, స్వాభిప్రాయమును కలిగియుండుటకు స్వాతంత్ర్యమును, రాజ్యసీమా నిరపేక్షముగా, నెట్టి మధ్యస్త మార్గముననైన సమాచార, సంసూచనలను అన్వేషించుటకు, పొందుటకు, ఉపపాదించుటకు, స్వాతంత్ర్యమును, ఈ హక్కులో నిమిడి యున్నది.

**అనుచ్ఛేదము 20.** *(!)* ప్రతి వ్యక్తికిని, శాంతి యుత సమావేశమునకు, సాహచర్యమునకు హక్కు గలదు.

*(!!)* ఎవ్వరిని గాని, ఒక సమాజమునకు చేరి యుండ వలయునని నిర్బంధింప కూడదు.

**అనుచ్ఛేదము 21.** *(!)* ప్రతి వ్యక్తికిని, స్వయముగా గాని, స్వేచ్ఛగా ఎన్నుకొనబడిన ప్రతి నిధుల ద్వారా గాని, తన దేశ ప్రశాసనమునందు పాల్గొనుటకు హక్కు గలదు.

*(!!)* ప్రతి వ్యక్తికిని తన దేశమునందలి లోక సేవలలో సమాన ప్రవేశాధికారము గలదు.

*(!!!)* ప్రభుత్వాధికారమునకు ప్రజల సంకల్ప శక్తియే ఆధారమై యుండ వలయును. సార్వ జనీనము సమాన మతాధికార యుతమునగు, నియత కాలిక యథార్థ నిర్వాచనలలో ప్రజల సంకల్పము సువ్యక్తము కావలెను. ఈ నిర్వాచన, గూఢశలాకా పద్ధతి ననుసరించి గాని, తత్సమానమయిన స్వేచ్ఛా మతదాన ప్రక్రియ ననుసరించి గాని, జరుగవలెను.

**అనుచ్ఛేదము 22.** సంఘమునందలి సభ్యుడుగా, ప్రతి వ్యక్తికిని సామాజిక రక్షకు హక్కు గలదు. రాష్ట్రీయ ప్రయత్న, అంతర్ రాష్ట్రీయ సహకారముల ద్వారా, ప్రతి రాజ్యము యొక్కయు వ్యవస్థాపనా సాధన సామగ్రుల ననుసరించి, తన ప్రతిపత్తి కిని తన వ్యక్తిత్వము యొక్క స్వేచ్ఛాభి వృద్ధికిని అత్యావశ్యకము లయిన, ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక స్వత్వముల సంపాదనకు అతని కధికారము కలదు.

**అనుచ్ఛేదము 23.** *(!)* పనికిని, ఉద్యోగము నెంచుకొనుటలో స్వేచ్ఛకును, పని విషయమున న్యాయము ననుకూలమునగు పరిస్థితులకును, నిరుద్యోగము నుండి పరిరక్షింప బడుటకును, ప్రతి వ్యక్తికిని హక్కు గలదు.

*(!!)* సమాన కార్య నిర్వహణమునకు, సమాన వేతనమును, విభేద రహితముగ, పొందుటకు ప్రతి వ్యక్తికిని నధికారము కలదు.

*(!!!)* మానవ ప్రతిపత్తి కి అర్హమగు జీవనమును తనకును తన కుటుంబమునకును సునిశ్చితము చేయు నట్టిదియును, అవశ్యకమయినచో సామాజిక పరిరక్షా సాధనాంతరములచే పరి పూర్తిని పొంది నట్టిదియు, న్యాయము ననుకూలము నయినదియునగు, పారితోషికమును పొందుటకు పని చేయు ప్రతి వ్యక్తికిని హక్కు గలదు.

*(!!!!)* ప్రతియొకరికిని, స్వీయహిత రక్షణార్థము వ్యాపార సంఘములను గూర్చుటకును, వానిలో చేరుటకును హక్కు గలదు.

**అనుచ్ఛేదము 24.** పని కాలము యొక్క యుక్త పరిమితత్వమునకును, వేతన సహితములగు నియత కాలికము లయిన సెలవు దినములకును, విశ్రాంతి విరామములకును, ప్రతి వ్యక్తికిని హక్కు గలదు.

**అనుచ్ఛేదము 25.** *(!)* ఆహార, వస్త్ర, ఆవాసస్థల, వైద్యోపచార, ఆవశ్యక సాంఘిక పరిచర్యల తో గూడి నట్టిదియు, తన యొక్కయు తన కుటుంబము యొక్కయు ఆరోగ్యమునకును స్వాస్థ్యమునకును ప్రర్యాప్తమగు నదియునగు, జీవన ప్రమాణమునకును, ప్రతియొకరికీని హక్కు గలదు. మరియు నిరుద్యోగ, రుగ్మతా, అసమర్ధతా, వైధవ్య, వార్థక్యముల నుండియు, లేక తన వశమున కతీతము లయిన సందర్భము లందు గలుగు జీవిక లోపము నుండియు, రక్షను పొందుటకు, ప్రతి వ్యక్తికిని హక్కు గలదు.

*(!!)* విశిష్టోపచార సహాయములను బొందుటకు, మాతృత్వ శైశవముల కధికారము గలదు. వైవాహిక సంబంధమున జనించిన వారైనను, తదవ్యముగ జనించిన వారైనను, శిశువు లెల్లరును సమాన మయిన సామాజిక పరిరక్షణ ననుభవింతురు.

**అనుచ్ఛేదము 26.** *(!)* ప్రతి వ్యక్తికిని విద్యకు హక్కున్నది. ప్రాథమిక ప్రాతిపదిక దశల యందైనను విద్య శుల్క రహితమై యుండ వలయును. ప్రాథమిక విద్య నిర్బంధము గావలెను. యోగ్యత ననుసరించి, యెల్లరకును పారి భాషిక వృత్తి విద్యలు, సాధారణముగా, నుపలభ్యములు గను, మరియు, నున్నత విద్య, సమానముగ నెల్లరకును, సుగమముగను చేయబడవలయును.

*(!!)* మానవ వ్యక్తిత్వ సమగ్రాభివృద్ధికిని, మానవ స్వత్వ ప్రాతిపదిక స్వతంత్రతా విషయిక గౌరవమును దృఢ పరుచుటకును, విద్యను ప్రవర్తింప చేయ వలయును. అన్ని రాష్ట్రములకును జాతి, లేక, మత సంబంధ మయివ వర్గములకును మధ్య, సంయగ్భావ, సహన, సౌహార్ద భావములను, పెంపొందించ వలయును, మరియు శాంతి సంరక్షణకై ఐక్య రాష్ట్రముల కార్యకలాపమును చరింపజేయ వలయును.

*(!!!)* తమ బిడ్డలకు ఏ విధమగు విద్య యవసరమో నిర్ణయించుకొను ప్రాగధికారము తల్లిదండ్రులకు గలదు.

**అనుచ్ఛేదము 27.** *(!)* సమాజము యొక్క సాంస్కృతిక జీవితము నందు స్వేచ్ఛగా పాల్గొనుటకును, కళావిషయ కానందము ననుభవించుటకును, శాస్త్ర ప్రగమనము లందును, తత్ఫలితము లందును సహభాగి యగుటకును, ప్రతి వ్యక్తికిని హక్కు గలదు.

*(!!)* తన కర్తృత్వముచే సముత్పన్నము లయిన శాస్త్ర, సారస్వత, కళా, రచనలవలన సిద్ధించిన నైతికార్థిక లాభములను రక్షించు కొనుటకు ప్రతి యొకరికిని హక్కు గలదు.

**అనుచ్ఛేదము 28.** ఈ ప్రకటన యందు పొందు పరుప బడియున్న స్వత్వ స్వాతంత్ర్యములు సంపూర్ణముగ సిద్ధింప గల ఒక సాంఘిక అంతర్ రాష్ట్రీయ వ్యవస్థకు, ప్రతి వ్యక్తికిని అధికారము గలదు.

**అనుచ్ఛేదము 29.** *(!)* సమాజము నందు మాత్రమే మానవ వ్యక్తిత్వము స్వేచ్ఛగా, సంపూర్ణ వికాసము నొందుటకు అవకాశము గలదు, కనుక, సమాజము నెడ ప్రతి యొకరును నిర్వహింప వలసిన కర్తవ్యములు గలవు.

*(!!)* తన స్వత్వములను, స్వాతంత్ర్యములను, ప్రయోగించుట లో ప్రతి యొకరును, ఇతరుల స్వత్వ స్వాతంత్ర్యముల యెడ అర్హాంగీకార గౌరవములను సురక్షితపరచు నుద్దేశముతోను, మరియు, ప్రజాస్వామిక సమాజము నందు నీతి, సామాజిక వ్యవస్థా, సార్వజనిక స్వాస్థ్యములకు, న్యాయముగ అవసరములగు వానిని కూర్చు నుద్దేశముతోను మాత్రమే, విధిచే నిశ్చయింప బడినట్టి నిబంధనలకు మాత్రమే అధీనులయి యుందురు.

*(!!!* ఈ స్వత్వములు, స్వాతంత్ర్యములు, ఐక్య రాష్ట్రముల ఆశయము లకును నియమములకును విరుద్ధముగా నెన్నడును బ్రయుక్తములు గారాదు.

**అనుచ్ఛేదము 30.** ఈ ప్రకటనలో పొందు పరుపబడియున్న ఏ స్వత్వ స్వాతంత్ర్యముల నైనను నాశనము చేయుట కుద్దిష్టమగు నెట్టి కార్యమునయిన నాచరించుటకు గాని, అట్టి కార్యాదరణమున ప్రవర్తించుటకు గాని, ఏ రాజ్యముకైనను లేక, వర్గముకైనను, వ్యక్తికైనను, అధికారము కలిగించు నదిగ వివక్షితమయి యున్నట్లుగా, ఈ ప్రకటనము నందున్న దేనికిని వ్యాఖ్యానము చేయకూడదు.

---

అపూర్వపదముల నిఘంటువు :- స్వత్వము : హక్కు; విధి : చట్టము, శాసనము; అంతఃకరణము : మనస్సాక్షి; ప్రత్యంగము : ప్రతిభాగము; అనుష్టానము : ఆచారకర్మ; నిర్వాసనము : దేశభ్రష్టత; క్షేత్రము : సంస్థానము, చిన్న రాష్ట్రము; ఫలకారమైన : ఉపయుక్తమైన; సభ్యుదయ : శ్రేష్టమైన; వివేద : వివేకము; న్యాసము : సంరక్షణ; రాష్ట్రీయ : జాతీయ; అంతర్ రాష్ట్రీయ : అంతర్ జాతీయ; ప్రత్యయ : విశ్వసించు; సంవిధానము : రాజ్యాంగము; ప్రతిపత్తి : ఘనత, గౌరవము; ఐక్య రాష్ట్రములు : ఐక్య రాజ్యములు; వ్యక్తి రాజ్యములు : సభ్య రాజ్యములు; జీవిక : జీవనోపాయము; బ్రయుక్తములు : ప్రయోగములు; వివక్షితమై : భావమునిచ్చు